## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



లింగన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**బ్రహ్మసముద్రం :** మండలంలోని పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోడిపల్లి లింగన్న (46) గురువారం మృతిచెందాడు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధరప్ప తదితరులు లింగప్ప మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, మాజీ ఎంపీపీ మహదేవప్ప, నాయకులు వైస్ సర్పంచ్ చిన్న నీలప్ప, నాగేంద్రప్ప, మాజీ ఎంపీటీసీ లోకేష్, జయరాం, మండల డాక్టర్ల విభాగం అధ్యక్షుడు వసంత్, మహత్మరెడ్డి, తిప్పేస్వామి మల్లేష్ పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట:** మండలంలోని పూలకుంటలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి(78) అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి గ్రామానికి చేరుకొని మల్లారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేపీ దొడ్డి సర్పంచ్ రమేష్, నాయకులు సుధాకర్‌రెడ్డి, హనుమన్న, రామప్ప, నాగప్ప, గొల్లరాజప్ప, శ్రీరాములు, తలారి హనుమంతు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



ఎంపీడీఓ కొండన్నకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

**రాయదుర్గంటౌన్:** పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీయో కొండన్నను కలిసి సామూహిక సెలవు నోటీసు, సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులపై పనిభాగం పెరిగిందన్నారు. విధుల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

### సీఎస్‌డీటీగా శాంతకుమారి

**కూడేరు:** కూడేరు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్(సీఎస్‌డీటీ)గా శాంతకుమారిని ఉన్నతాధికారులు నియమించారు. శుక్రవారం సీఎస్‌డీటీగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇంత వరకు ఆత్మకూరు మండలం సీఎస్‌డీటీ లక్ష్మీదేవి ఇన్‌చార్జ్‌గా పని చేశారు. సీఎస్‌డీటీ శాంత కుమారిని డీలర్లంతా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### మార్చిలోపు ఇళ్లు పూర్తి చేస్తేనే బిల్లులు

**కూడేరు:** వచ్చే ఏడాది (2027)మార్చి లోపు పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటేనే బిల్లులు అందుతాయని హౌసింగ్ డీఈ హనుమప్ప లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం ఆయన ముద్దలాపురం, కూడేరులోని జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం దాటితే బిల్లులు రావని, లబ్ధిదారులు నష్ట పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

### బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దుర్మార్గం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

**ఉరవకొండ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి శ్రామికులకు 8 వారాల నుంచి బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని మోపిడిలో ఉపాధి శ్రామికుల సమస్యలు తెలుసుకునేందుకు వారు పనిచేసే చోటకే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధి కూలీల బిల్లులు చెల్లించి, వారికి పని ముట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మురళి, సిద్దప్ప, వీరాంజనేయులు రవి, తదితరులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**బొమ్మనహాళ్:** రమనేపల్లి సమీపంలో పేకాట స్థావరంపై ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసులు, సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. ఇందులో ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4450 నగదును స్వాధీనం చేసుకున్నారు.

# ఇంకెన్నాళ్లీ సర్దుబాటు చదువులు?



నిలిచిపోయిన నూతన భవన నిర్మాణ పనులు



గదుల కొరతతో పాఠశాల మిద్దెపై తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం... ఇంటర్ విద్యార్థినులకు శాపం
- పూర్తికాని బాలికల జూనియర్ కళాశాల భవనం
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే 85 శాతం పనులు పూర్తి

**రాయదుర్గంటౌన్:** నియోజకవర్గ కేంద్రమైన రాయదుర్గం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు సర్దుబాటు చదువులు తప్పడంలేదు. 2017లో బాలికల జూనియర్ కళాశాల మంజూరైంది. నాటి నుంచి స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోనే జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 85శాతం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనంతరం సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి నుంచి పనులు ముందుకు సాగడంలేదు. విద్యార్థినులకు అవస్థలు తప్పడంలేదు. సౌకర్యాల లేమితో అనేక మంది ప్రైవేట్ కళాశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని కణేకల్లు రోడ్డు శనీశ్వరాలయం సమీపంలో ఆర్‌ఐడీఎఫ్ కింద రూ.52 లక్షలు, నాడు–నేడు కింద రూ.62 లక్షలతో కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే దాదాపు 80 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తి చేశారు. జీ ప్లస్ నిర్మాణంలో గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం పూర్తి కాగా, నీటి వసతి, ప్రహరీ, అప్రోచ్‌రోడ్డు వసతి కల్పించాల్సి ఉంది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బిల్లులు ఆగిపోవడంతో ఎక్కడికక్కడే పనులు ఆగిపోయాయి. రూ. కోట్లు ప్రజాధనం వెచ్చించి చేపట్టిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన ప్రభుత్వం.. పట్టించుకోవడంలేదు.



తరగతి గదిలో కిక్కిరిసిన విద్యార్థినులు



ప్రస్తుతం జెడ్పీ బాలికోన్నత పాఠశాల గదుల్లోనే నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాల

**మిద్దెపైనే తరగతుల నిర్వహణ..**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 550 మంది విద్యార్థినులు చదువుతున్నారు.200 మందికిపైగా మొదటి సంవత్సరం, 332 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని మూడు గదుల్లో జూనియర్ కళాశాల విద్యార్థులకు కేటాయించారు. ఇందులో ఒక దాంట్లో పిన్సిపాల్, సిబ్బంది, కార్యాలయ ఫైళ్ల నిర్వహణ, కేవలం రెండు గదుల్లోనే అన్ని గ్రూపుల విద్యార్థినులకు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. తరగతుల నిర్వహణకు కనీసం 6 గదులు, ప్రిన్సిపాల్ రూము, ల్యాబొరేటరీ, సిబ్బందికి గదులు ఉండాల్సి ఉంది. మరోవైపు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులే వేలాది మంది ఉన్నారు. కళాశాల బాలికలకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. తరగతి గదుల్లో బెంచీలు లేక నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి.జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సర్దుబాటు గదులతో చదువులు ముందుకు సాగక కళాశాల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రాయదుర్గంలో ఉన్న ఏకైక బాలికల జూనియర్ కళాశాల కావడంతో ఏటా అధిక సంఖ్యలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. సౌకర్యాల లేమితో అనేక మంది ప్రైవేటు కళాశాలలో చేరుతున్నారు.

**భవనాన్ని అందుబాటులోకి తేవాలి**



కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. కేవలం రెండు, మూడు గదుల్లో వందలాది మంది విద్యార్థులు ఏ విధంగా చదువుతారు. ప్రభుత్వం విద్యార్థినుల ఇబ్బందులను గుర్తించాలి. అసంపూర్తిగా ఉన్న కళాశాల భవన నిర్మాణాలను పూర్తి చేయించాలి.

– పి.అంజినేయులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి, రాయదుర్గం

**గదుల కొరత తీర్చాలి**



కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థినులకు గదుల కొరత తీర్చాలి. రెండు గదుల్లోనే తరగతులు ఎలా నిర్వహిస్తారు?.. కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోనే విద్యార్థినులు సర్దుకోవాల్సి వస్తోంది. మౌలిక వసతుల కొరత ఉంది. గదుల కొరతతో మిద్దెలపై చదవాల్సి వస్తోంది.

– సీ అనూష, ద్వితీయ సంవత్సరం, హెచ్ఈసీ, బాలికల జూనియర్ కళాశాల, రాయదుర్గం

## కాకాణి కుటుంబ సభ్యులకు 'విశ్వ' పరామర్శ

**ఉరవకొండ:** నెల్లూరులోని మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి కుటుంబ సభ్యులను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి సతీమణి, కుమార్తెను విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమంగా కాకాణిపై తప్పుడు కేసులు బనాయించి, అరెస్టు చేయించిందన్నారు. కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, నెల్లూరు జిల్లా ముఖ్యనేతలు సుబ్రమణ్యంరెడ్డి, గూడూరు జెడ్పీటీసీ మహేంద్రరెడ్డి, నెల్లూరు పార్టీ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



నెల్లూరులో కాకాణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

## 2న ఉరవకొండలో ముఖ్యనేతల సమావేశం

**వజ్రకరూరు:** ఉరవకొండలోని వీరశైవ కళ్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్య నేతలతో జూలై 2న సమావేశం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ జూలై 2న ఉరవకొండలో అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులకు నియామక పత్రాలు అందయజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నరేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు విజయ్‌కుమార్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ హబీబ్, రైతు విభాగం అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్యాపిలి కిష్టప్ప, యువజన విభాగం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శీనానాయక్, ఎద్దాటి రమేష్, ప్యాపిలిభీమా, సురేష్,శర్మాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి తదితరులు

## స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

**ఉరవకొండ:** పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ అంజుమన్‌సఫ్రీన్, జేఈఈ ఐజయ్య తెలిపారు. పీఏబీఆర్ జలాశయం నుంచి ఉదిరిపికొండ మీదుగా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణంతో ఉరవకొండకు నీరు తీసుకొచ్చే పనులు దాదాపు పూర్తి కావడంతో అధికారులు నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతమైంది. శుక్రవారం పైప్‌లైన్ నిర్మాణ పనులతో పాటు నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఫిల్టర్‌బెడ్ల నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ అంజుమన్‌సఫ్రీన్, జేఈఈ ఐజయ్య పరిశీలించారు. ఈసందర్భంగా డీఈఈ, జేఈ మాట్లాడుతూ రూ.16.35 కోట్లతో 17.2 కిలోమీటర్ల పొడవున నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు నీరు తీసుకురానున్నట్లు తెలిపారు. ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద 4 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంప్ నిర్మాణం కూడా పూర్తయ్యిందన్నారు. నింబగల్లు గ్రామం వద్ద ఉరవకొండతో పాటు మరో ఏడు గ్రామాలకు నీరు అందించే పైప్‌లైన్ ఏర్పాటుకు ఫిల్టర్ బెడ్లు సిద్ధం చేశామన్నారు.



నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఫిల్టర్ బెడ్లు పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ

## మాజీ సర్పంచు ఆలేరి విజయలక్ష్మి మృతి

**కణేకల్లు:** వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డి సతీమణి, గరుడచేడు మాజీ సర్పంచు ఆలేరి విజయలక్ష్మి (69) శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. విజయలక్ష్మి సర్పంచుగా, ఎంపీటీసీ సభ్యురాలుగా పనిచేశారు. అనారోగ్యంతో బాధపడుతూ గత కొన్ని రోజులుగా బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి విజయలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులు, ఆలేరి రాజగోపాల్‌రెడ్డిని పరామర్శించారు. గరుడచేడులో శనివారం ఉదయం 10.30 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆలేరి విజయలక్ష్మి (ఫైల్)



బెంగళూరులోని ఆస్పత్రిలో ఆలేరి రాజగోపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

## సబ్ మార్కెట్ యార్డు పనులు పూర్తి చేస్తాం

**కణేకల్లు:** కణేకల్లు శివారు ప్రాంతంలో అర్ధంతరంగా ఆగిన సబ్ మార్కెట్‌యార్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, డైరెక్టర్ చాంద్‌బాషా తెలిపారు. అర్ధంతరంగా ఆగిన సబ్‌మార్కెట్ యార్డు పనులను మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ యార్డుకు దారి సమస్య కూడా ఉందని సిబ్బంది చైర్మన్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్‌మార్కెట్‌యార్డు కణేకల్లు ప్రాంతం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్‌యార్డు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీనివాసులు, డీసీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్, వీఆర్వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అర్ధంతరంగా ఆగిన పనులను పరిశీలిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి

## ప్రభుత్వ ప్రయోజనాలు వర్తింపజేయండి

**రాయదుర్గంటౌన్:** అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు అందేలా మహిళా స్వయం సహాయక సంఘాలు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో జరిగిన కార్యక్రమంలో ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా కార్మికుల వివరాలు నమోదు చేసేందుకు మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సురేష్, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

### బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఈశ్వరమ్మ

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఈశ్వరమ్మ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుగుణమ్మ గుంతకల్లుకు బదిలీ చేశారు. శుక్రవారం హాస్టల్‌లో నూతన వార్డెన్ ఈశ్వరమ్మ బాధ్యతలు చేపట్టారు.

### మహిళా రైతుపై దాడి

**వజ్రకరూరు:** మండలంలోని వెంకటాంపల్లిపెద్ద తండాలో శుక్రవారం సాయంత్రం పొలం తగాదాలో మహిళా రైతు లక్ష్మీబాయిపై అదే గ్రామానికి చెందిన గోపినాయక్, హేమ్లా నాయక్ దాడి చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

### కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**బొమ్మనహాళ్:** మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ సచివాలయంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ కుట్టు శిక్షణ పూర్తి చేసిన అనంతరం మహిళలకు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న, శిక్షణ కోఆర్డినేటర్ లక్ష్మీ పాల్గొన్నారు.

### సజ్జలను కలిసిన మెట్టు



మరూరు టోల్‌గేట్ వద్ద సజ్జలకు స్వాగతం పలుకుతున్న మెట్టు, పార్టీ నేతలు

**రాయదుర్గం:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్, పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. శుక్రవారం శింగనమల పర్యటనకు వస్తున్న సజ్జల, మిథున్‌రెడ్డిని మరూరు టోల్ గేట్ వద్ద కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సజ్జల, మిథున్‌రెడ్డి లతో మెట్టు స్థానిక రాజకీయ పరిస్థితులను చర్చించారు. రాయదుర్గంలో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని వారు సూచించారు. యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఇద్దరు నేతలను బెంగళూరు ఎయిర్‌పోర్టులో కలిశారు.

### రాయదుర్గం ఏడీఏగా పద్మజ

**రాయదుర్గం:** రాయదుర్గం వ్యవసాయ ఉప సంచాలకులు (ఏడీఏ)గా పద్మజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండ ఏడీగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉండి ఖరీఫ్ సాగులో రైతులు పాటించాల్సిన సలహాలు, సూచనలు తెలియజేస్తామన్నారు. సులభతరహా వ్యవసాయంతో పాటు లాభసాటిగా మార్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయా మండలాల ఏఓలు ఏడీఏకు శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు చేపట్టిన పద్మజ

### కర్రలే విద్యుత్ స్తంభాలు

**రాయదుర్గంటౌన్:** పేదలు నివసించే కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. విద్యుత్ స్తంభాల కొరతతో కర్రల సాయంతో సర్వీసు వైర్లు ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. పట్టణ సమీపంలోని గౌడ ఇందిరమ్మ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో స్థానికులు కర్రలు స్తంభాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ సర్వీసు వైర్లను లాగారు. గాలీవాన వచ్చిన సమయంలో కర్రలు కింద పడుతుంటాయని, మళ్లీ వ్యయప్రయాసలకోర్చి సరిచేసుకోవాల్సిన పరిస్థితి వస్తోందని స్థానికులు అంటున్నారు.



గౌడ ఇందిరమ్మ లేఅవుట్ శివారు వాటర్ ట్యాంకు వద్ద కర్రలకు కట్టిన సర్వీసు వైర్లు

### 'ఉపాధి' అక్రమాలపై విచారణ చేయండి



సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

**కళ్యాణదుర్గం (కంబదూరు):** గ్రామంలో జరిగిన ఉపాధి అక్రమాలపై విచారణ జరిపించాలని కంబదూరు మండలం కురాకుల పల్లి గ్రామస్తులు అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో గ్రామానికి చెందిన నాగరాజు, లింగన్న, గోపాల్, శ్రీనివాసులు తదితరులు ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఏపీ120340120121040‌6, 10906, 10907, 10908, 10909 జాబ్ కార్డుల వారు ఉపాధి పనులకు వెళ్లకుండానే ప్రతి వారం వారి ఖాతాకు డబ్బు జమవుతుందన్నారు. దీనిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పూర్తి ఆధారాలతో త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీలోనే సముచిత స్థానం



ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం:** వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల వారికీ సముచిత స్థానం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండల పార్టీ అనుబంధ సంఘాల కమిటీలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా జానీకి చోటు కల్పించారు. ఈసందర్భంగా శుక్రవారం నాయకులు జానీని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా లీగల సెల్ అధ్యక్షుడు లాయర్ హనుమంతరెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మండల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, గోళ్ల సూరి, తాలూక లీగల్ సెల్ అధ్యక్షుడు అడ్వకేట్ బిటీ రామాంజనేయులు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, నాయకులు శివ, వన్నూరుస్వామి, గోపాల్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**కూడేరు:** స్థానిక కుష్టు రోగుల కాలనీ సమీపంలో అనంతపురం – బళ్లారి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన దంపతులు రాఘవ, అనిత గాయపడ్డారు. ఉరవకొండ నుంచి ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గుమ్మఘట్ట:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని కలుగోడులో పరిసరాలు పరిశుభ్రత, ఇంటింటా చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని తెలిపారు. అనంతరం తాళ్లకెర,బీటీపీ గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

### 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**రాయదుర్గంటౌన్:** స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో ఈనెల 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్‌మీట్ ఉంటుందని చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో చేపట్టబోవు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై కౌన్సిల్‌మీట్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలన్నారు.

### ఆరోగ్య కార్యకర్తలకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఆరోగ్య కార్యకర్తలను సన్మానిస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్:** బదిలీపై వెళ్తున్న దర్గాహొన్నూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు హేమాంజలి, రాధికలను వైద్యాధికారులు సుల్తానా, రఫీయా సుల్తానా, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీనాయక్, సుశీలమ్మ, జయ భారతి పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చూపొద్దు

**వజ్రకరూరు:** ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చూపొద్దని అధికారులను తహసీల్దార్ నరేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో తహసీల్దార్ సమావేశం ఏర్పాటు చేశారు. డీటీ కేశవరెడ్డి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసు నమోదు

**బొమ్మనహాళ్:** కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. మండలంలోని యలగలవంక గ్రామంలో చోటు చేసుకున్న పొలం తగాదాలో తనను హనుమన్న అనే వ్యక్తి దూషించారంటూ దళిత తిమ్మన్న చేసిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.